

దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ భారత్ ట్రస్టు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ వారి సహకారంతో ఈనెల 25 నుంచి మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30రోజుల పాటు శిక్షణ ఉంటుందని, 19-45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులని తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 7893121143, 9391487797, 9177141712 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ కోసం నకిలీ బిల్లులు

- నాలుగు ఆసుపత్రుల అనుమతులు రద్దు
- మరో రెండు హాస్పిటల్స్ మూసివేత
- జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నకిలీ బిల్లులు సృష్టించి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసిన నాలుగు ఆసుపత్రుల అనుమతులను రద్దు చేసినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిధులు దుర్వినియోగంపై వైద్యాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధిని రాష్ట్రంలోని 28 ప్రైవేట్ ఆసుపత్రులు దుర్వినియోగం చేసినట్లు చెప్పారు. నకిలీ బిల్లులు సృష్టించి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసిన వారిపై సీఐడీ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో నాలుగు ఆసుపత్రులు ఇంతకుముందే మూతబడినట్లు చెప్పారు. ఈ ఆసుపత్రుల అనుమతులను (నాగార్జున కాలనీ, హస్తినాపురంలోని డెల్టా ఆసుపత్రి, వనస్థలిపురంలోని శ్రీరక్ష ఆసుపత్రితో పాటు ఎంఎంఎస్ ఆసుపత్రి, సాగర్‌రోడ్డు బైరామలగూడలోని శ్రీ సాయి తిరుమల ఆసుపతి) రద్దు చేయడం జరిగిందని చెప్పారు. మిగతా ఆసుపత్రులకు ఈనెల 4న నోటీసులు ఇచ్చామని, వాటికి వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశించినట్లు పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాల మేరకు సరూర్‌నగర్‌లోని హిరణ్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎంఎంవీ ఇందిరా మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులను తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈ రెండు ఆసుపత్రులను మూసి వేయడం జరిగిందని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్‌లో అడ్డదారులు తొక్కిన ఈ ఆసుపత్రులపై ప్రభుత్వం సీఐడీ కేసులు కూడా నమోదు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పునం, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ గీత, జిల్లా మాస్ మీడియా అధికారి కె. శ్రీనివాసులు, సరూర్‌నగర్, బాలాపూర్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: ఏప్రిల్ 24, (ఆంధ్రజ్యోతి) రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. గురువారం మొయినాబాద్‌లో భూభారతి చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ నారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. భూ భారతి అమలుతో రైతుల సమస్యలన్నీ తీరిపోతాయని తెలిపారు. గతంలో ధరణితో వారు అనేక ఇబ్బందులు పడ్డారని, భూ భారతి చట్టం ద్వారా రెవెన్యూ రికార్డుల్లో నెలకొన్న సమస్యలు మండల, డివిజన్ స్థాయిలో పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు.

కొత్త చట్టంతో రైతులకు మేలు : కలెక్టర్

భూభారతి నూతన ఆర్‌వోఆర్ చట్టం ద్వారా రైతుల సమస్యలు తీరుతాయని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. ఈ పోర్టల్‌లో రైతులకు సంబంధించిన భూముల వివరాలు పక్కాగా పొందుపరచడం జరుగుతుందన్నారు. తప్పుల సవరణకు కూడా అవకాశం ఉంటుందన్నారు. మొయినాబాద్ మండల కేంద్రంలో మీసేవా కేంద్రం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఏర్పాటు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి కోరారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం

షాబాద్ : భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టం ద్వారా భూ వివాదాల పరిష్కారానికి దోహదపడుతుందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. గురువారం షాబాద్‌లో స్టార్ గార్డెన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతులకు వారి భూములపై పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు నూతన ఆర్‌వోఆర్ చట్టంలో అనేక కొత్త అంశాలను పొందుపరిచినట్లు తెలిపారు. భూ భారతి 2025 చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలు ఉన్నాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ గౌతమ్‌కుమార్, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, పీఏసీఎస్ ఛైర్మన్ చంద్రారెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ జంగయ్య, మాజీ జడ్పీటీసీ కె.శ్రీకాంత్, తహసీల్దార్ అన్వర్, ఎంపీడీవో అపర్ణ, డిప్యూటీ తహసీల్దార్ మధు, ఏఎంసీ డైరెక్టర్లు అక్తర్‌పాష, వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు రవీందర్, వెంకట్‌రెడ్డి, చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచులు ప్రతాప్‌రెడ్డి, రవీందర్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, జంగయ్య, లింగం, నర్సింహులు పాల్గొన్నారు.



మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా పీఎంఎఫ్ ఎంఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ స్కీం ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు తోడ్పాటునందిస్తుంది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు రుణ సౌకర్యం కల్పిస్తూ ప్రోత్సహిస్తోంది. 2023-24, 2024-25 సంవత్సరంలో 256 మందికి ఆర్థిక చేయూతనివ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, దానిని అధిగమించి అధికారులు నిధులు మంజూరు చేశారు. జిల్లాలో 262 మంది లబ్ధిదారులకు 182 యూనిట్లకు రూ.5కోట్ల 22 లక్షల రుణం మంజూరు చేశారు. వీరంతా ఆహార ఉత్పత్తుల శుద్ధి యూనిట్లు ఏర్పాటు చేసుకొని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఆర్థికంగా వృద్ధి చెందుతూ తోటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆహార శుద్ధి..

ఔత్సాహికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటునందిస్తున్నాయి. ఔత్సహికులు ముందుకు వచ్చి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. యూనిట్ల స్థాపన కోసం వ్యక్తిగతంగా కాకుండా స్వయం సహాయక సంఘాలకు సబ్సిడీతో కూడిన రుణం పొందవచ్చు. ఆహార శుద్ధి వ్యక్తిగత యూనిట్లలో గరిష్ఠంగా పది లక్షల వరకు సబ్సిడీ ఉంటుంది. గ్రూప్‌గా ఏర్పడి యూనిట్ స్థాపిస్తే సబ్సిడీ ఎక్కువగా పొందవచ్చు.

- శ్రీలత, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి

అతివల వృద్ధి

‘పీఎంఎఫ్ఎంఈ’ ద్వారా ప్రోత్సాహం

- పరిశ్రమల ఏర్పాటుకు రుణం
- ఇంటి వద్దే సంపాదనకు అవకాశం
- సబ్సిడీ రుణాలతో ఆర్థిక చేయూత
- మూడేళ్లలో 262 మంది లబ్ధిదారులకు రూ.5.22 కోట్లు
- వ్యాపారాల్లో రాణిస్తున్న మహిళలు



ఫరూక్‌నగర్‌లో తయారు చేసిన గానుగ నూనెను అమ్ముతున్న మహిళలు

ఆర్థిక సంవత్సరం	మొత్తం లబ్ధిదారులు	మంజూరు వివరాలు(రూ.లక్షల్లో)	యూనిట్లు
2023-24	182	337.05	మిర్చి పౌడర్, పసుపు పొడి, జొన్న రొట్టెల తయారీ, గానుగ చెక్క నూనె, బిస్కెట్ల తయారీ, పల్లీపట్టి,
2024-25	80	185.29	బ్రెడ్ తయారీ యూనిట్లు, హోంఫుడ్, బేకరీ, అల్లం వెల్లుల్లి పేస్టు, పాల శుద్ధీకరణ యూనిట్లు
మొత్తం	262	522.34	

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఆహార శుద్ధి యూనిట్లకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుంది. మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం నిరుద్యోగ యువతకు రుణ సౌకర్యం కల్పిస్తుంది. ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం(పీఎంఎఫ్ ఎంఈ) ద్వారా అతివలకు ఇంటి వద్దే సంపాదనకు అవకాశం కల్పిస్తుంది. ఆహారశుద్ధి రంగంలో చిన్న మధ్యస్థాయి పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ఆర్థికంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనందిస్తోంది. మొత్తం యూనిట్ కాస్ట్‌లో 10శాతం చెల్లించిన లబ్ధిదారులు 35 శాతం సబ్సిడీ పొందుతున్నారు. మిగతా 55శాతం బ్యాంకు రుణంగా తీసుకుంటున్నారు. 2023-24, 25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 262 మంది లబ్ధిదారులకు రూ.5 కోట్ల 22 లక్షల రుణాన్ని అధికారులు మంజూరు చేశారు. మహిళా సంఘాలకు

మిగతా 8వ పేజీలో...

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

25 శాతం రాయితీ పొందండి

కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై గురువారం సంబంధితశాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ నెల 30లోగా అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ చేసుకుంటే 25 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు. ఈ నెల 30వ తేదీ నాటికి ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు ముగియనున్నట్లు చెప్పారు. రుసుము చెల్లించిన వారి దరఖాస్తును అధికారులు పరిశీలించి సత్వరమే అనుమతి మంజూరు చేస్తారని తెలిపారు. అనధికారికంగా లేఅవుట్లు చేసి, అందులో 10 శాతం ప్లాట్లను విక్రయించిన వారికి మిగతా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో కూడా ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని తెలిపారు. క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతి మంజూరు చేయడం జరగదని స్పష్టం చేశారు.



వైద్య వృత్తి పవిత్రమైంది

7

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి



నాగార్జున సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారి

- రెండున్నరేళ్ల క్రితం సర్వే చేసిన అధికారులు
- ఇప్పటికీ మొదలు కాని పనులు
- ఇరుకు రోడ్డుపై నిత్యం ప్రమాదాలు

సర్వేతోనే సరి!

విస్తరణకు నోచని సాగర్- హైదరాబాద్ హైవే

యాచారం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారి విస్తరణకు నోచుకోవడం లేదు. రోడ్డు ఇరుకుగా ఉండడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. సమస్యను గుర్తించిన అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హైవే విస్తరణకు సర్వే చేయించారు. ఇబ్రహీంపట్నం నుంచి మాల్ వరకు సాగర్ ప్రధాన రహదారిని విస్తరించి డివైడర్ ఏర్పాటు చేయాలని రెండున్నరేళ్ల క్రితం రోడ్లు భవనాల శాఖ అధికారులు సర్వే చేశారు. కానీ, ఇప్పటివరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించలేదు.

రోడ్డు ప్రమాదాలతో గాలిలో ప్రాణాలు

నాగార్జున సాగర్-హైదరాబాద్ రోడ్డు ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాలలో ఇబ్రహీంపట్నంలో ఆరుగురు మృతి చెందగా, 12 మంది గాయపడ్డారు. మంచాలలో ఇద్దరు మృతి చెందగా, ఎనిమిది మంది గాయపడ్డారు. యాచారంలో ఆరుగురు మృతి చెందగా,

మిగతా 8వ పేజీలో...

పనులెందుకు ప్రారంభించ లేదు?



సాగర్ - హైదరాబాద్ ప్రధాన రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో రోడ్డు విస్తరణకు గతంలో సర్వే చేయించాం. దాని ఆధారంగా నిధులు మంజూరు చేసి రోడ్డును విస్తరించడంలో ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తుందో అర్థం కావడం లేదు. ఇబ్రహీంపట్నం చెరువు కట్టపైన, కింద కూడా రోడ్డు విస్తరించాల్సి ఉంది.

మంచిరెడ్డి కిషన్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యే

నీటితోనే మానవ మనుగడ

- ప్రతీ నీటిబొట్టును ఒడిసి పడదాం
- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత
- చిత్తాపూర్, తిప్పాయిగూడలో వాటర్‌షెడ్ ప్రారంభోత్సవ యాత్ర



సదస్సులో మాట్లాడుతున్న శ్రీలత

మంచాల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): నీటి సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి ఎల్.శ్రీలత పేర్కొన్నారు. వాటర్‌షెడ్ ప్రారంభోత్సవ యాత్రలో భాగంగా మంచాల మండలం చిత్తాపూర్, తిప్పాయిగూడలో గురువారం ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ముందుగా పాఠశాల విద్యార్థులు, అధికారులు, వాటర్‌షెడ్ కమిటీ సభ్యులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నీటి సంరక్షణ గురించి వివరించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ నీరులేనిదే జీవకోటి లేదని, ప్రతి నీటి బొట్లును ఒడిసిపట్టి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపైనే ఉందని గుర్తుచేశారు. వాటర్‌షెడ్ నిర్వహణ, భూమి, నీటి సంరక్షణ పెంచడమే వాటర్‌షెడ్ కమిటీల లక్ష్యమని చెప్పారు. ఈ పథకంలో ఉన్న పనులను సద్వినియోగం చేసుకొని గ్రామం, పరిసరాల్లో నీటినిలువ పనులు, పెద్దఊటకుంటలు, చెక్‌డ్యాంలు, చెక్ వాల్స్, గల్లీకంట్రోల్ పనులు, జీవన ఉపాధులను మెరుగుపరుచుకుని నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ఇంకా నీటి సంరక్షణ ఆవశ్యకతను వివరిస్తూ విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శన ఇప్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్‌రెడ్డి, రాంరెడ్డి, డిప్యూటీ సీఈవో రంగారావు, మండల ప్రత్యేకాధికారి సుజాత, ఎంపీడీవో బాలశంకర్, ఎంపీవో ఉమారాణి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, మాజీ సర్పంచ్ నాగరాజు, వాటర్ షెడ్ పీవో సంధ్యారాణి, ఏపీవో వీరాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, ఈసీ విమల, టీఏలు మహేష్, శేఖర్, కోటేశ్వర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలతో సాంకేతిక భవిష్యత్

ఈసీఐఎల్ టెక్నికల్ డైరెక్టర్ అనిష్‌కుమార్ శర్మ



మాట్లాడుతున్న అనిష్‌కుమార్ శర్మ

ఆదిభట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతికత రంగంలో పరిశోధనలు కీలకమని, విద్యార్థులు వాటిపై దృష్టి సారించాలని ఈసీఐఎల్ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ అనిష్‌కుమార్ శర్మ సూచించారు. మంగళ్‌పల్లిలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈఐఈ(ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్) డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఎంబెడెడ్, కంప్యూటింగ్, కంట్రోల్ అండ్ ఆటోమేషన్ అనే అంశంపై ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లు సాంకేతిక భవిష్యత్‌ను రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, అపూర్వమైన వేగంతో అభివృద్ధి చెందుతూ, నిపుణులు పరిశోధకులు అభ్యాసకులు, పరిశ్రమ నాయకులను తయారు చేసేందుకు దోహదపడతాయన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఔత్సాహికులు పాల్గొన్నారు. శాస్త్ర సాంకేతిక అంశాలలో అధిక నాణ్యత గల ఎంబెడెడ్ సిస్టం డిజైన్, రోబోటిక్స్ ఆటోమేషన్, సెన్సార్ నెట్‌వర్క్, రియల్‌టైం సిస్టం పరిశోధన పత్రాలను ప్రచురణ కోసం ఎంపిక చేశారు. 20 సంవత్సరాలు పూర్తి చేసుకొని ఎన్‌బీఏ అక్రిడేషన్‌తో ముందుకు నడుస్తున్న ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులను, విద్యార్థులను, కళాశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో డాక్టర్ భోజన్న పాసిక్, చైర్మన్ డాక్టర్ రాఘవ వి. చెరబుడ్డి, డైరెక్టర్ రామశాస్త్రి, ప్రిన్సిపల్ కే. రామ్మోహన్‌రెడ్డి, డీన్ రీసెర్చ్ కే. లాల్‌కిషోర్, ఎస్.హరివర్ధనగిరి, బి. నరేంద్ర, డి. శ్యాంప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల ఎల్లమ్మ జాతర


బోనాల ఊరేగింపుతో తరలుతున్న గ్రామస్తులు

వికారాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఎర్రవల్లిలో నాగుల ఎల్లమ్మ జాతర గురువారం రెండోరోజూ ఘనంగా నిర్వహించారు. యంత్ర ప్ర తిష్ఠ, ధాతు సంస్కారం, బలి ప్రదానం, మంగళహారతి తదితర పూజ లు నిర్వహించారు. అమ్మవార్లకు బోనాలతో నైవేద్యం సమర్పించారు. పూజల్లో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో రాజకీయ ప్రముఖులు, ఆర్టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్, నియోజకవర్గ నాయకులు, గ్రామ పెద్దలు, భారీ సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వేగవంతంగా ఫార్మాసిటీ భూ సర్వే


తాటిపర్తి సమీపంలో కొనసాగుతున్న సర్వే

యాచారం, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి):తాటిపర్తి, నానక్‌నగర్ గ్రామాల మధ్య ఫార్మాసిటీ భూముల సర్వే పనులు జోరుగా సాగుతోంది. గురువారం నాలుగు కిలోమీటర్ల సర్వే చేశారు. రైతులకు పరిహారం చెల్లించిన భూముల స్వాధీనానికి సర్వే చేసి హద్దులు పాతుతున్నారు. గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎస్సై, కొందరు పోలీసులు పర్యటిస్తూ కమిషనరేట్ అధికారులకు సమాచారమిస్తున్నారు.

కోర్టు కేసులోని భూమి సర్వేకు యత్నం ..

మేడిపల్లిలో రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు సర్వే నంబర్65 భూమి కోర్టు కేసులో ఉందనే విషయం తెలియక సర్వేకు పూనుకున్నారు. రైతులు ఈ విషయం చెప్పినా వారు వినలేదు. దీంతో పోలీసులు చేరుకొని రైతులను సముదాయించారు. కోర్టు వివాదముందని చెబితే సర్వే చేయం అని అధికారులు చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

నిర్మాణ రంగ కార్మికులకు బయోమెట్రిక్ విధానాన్ని రద్దుచేయాలి


మాట్లాడుతున్న కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నరసింహ

శంషాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):భవన నిర్మాణరంగ కార్మికులకు బయోమెట్రిక్ వేలిముద్ర విధానంతో ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ప్రతీ పనికి వేలిముద్ర మ్యాచ్‌కాక కార్మికులు లబ్ధిపొందలేకపోతున్నారని నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎం. నరసింహ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. నిత్యం సిమెంట్, ఇటుక, కంకర తదితర తాపి పనులతో కార్మికుల వేలిముద్రలు గురుకుబారుతాయని, దీంతో ఆధార్ వేలిముద్రలతో సరిపోలక డినైడ్ అయి సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదన్నారు. దీనికి బదులు కార్మికులకు ప్రత్యామ్యాయ విధానాన్ని అమలుచేయాలని కోరారు. లేబర్ అడ్డాల వద్ద సదుపాయాలు కల్పించాలన్నారు. శంషాబాద్‌లో జరిగిన సంఘం రాష్ట్ర సదస్సులో పలు తీర్మానాలను ఆమోదించామన్నారు. వలస కార్మిక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్మికులందరికీ ప్రభుత్వాలు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘం అధ్యక్షుడు పి.పర్వతాలు, యాదగిరి, మల్లికార్జున్, శివశంకర్, శేఖర్‌రెడ్డి, గిరి, ప్రభు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులు అమాయకులను చంపడం హేయం


సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

చేవెళ్ల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):కశ్మీర్‌లోని పహెల్గామ్‌లో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు టూరిస్టులను చంపడం హేయమైన చర్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య అన్నారు. గురువారం చేవెళ్ల పరిధి కందవాడలో పార్టీ గ్రామసభ నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ.. 27మంది అమాయకులు ఉగ్రమూకల కాల్పులకు బలైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 145కోట్ల మంది భారతీయులు తల్చుకుంటే ఉగ్రవాదులు, వారిని ఇండియాపైకి ఉసిగొల్పుతున్న పాకిస్తాన్ ఎక్కడుంటుందో ఊహించుకోవాలని హెచ్చరించారు. మోదీ పాలనలో దళిత, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణచారి, నాయకులు సత్తిరెడ్డి, మంజుల, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కంకరపై నడవలేక..

ఆమనగల్లులోని ఆరోవార్డు సాయినగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. నెలక్రితం కంకర పోసి వదిలేశారు.

- ఆమనగల్లు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి)



ర్యాంకర్ ఇంద్రార్చితకు స్వీట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే శంకర్

యుపీఎస్‌సీ ర్యాంకర్‌కు అభినందనల వెల్లువ

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): యుపీఎస్‌సీలో ర్యాంక్ సాధించిన ఇంద్రార్చితను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే యాదయ్య సన్మానించి, అభినందించారు. షాద్‌నగర్‌లోని టీచర్స్ కాలనీలో ఉంటున్న హోటల్ వ్యాపారి రాఘవేందర్‌రావు-మమత దంపతుల కూతురు ఇంద్రార్చిత యుపీఎస్‌సీలో 739వ ర్యాంక్‌ను సాధించింది. గురువారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే శంకర్, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే అంజయ్య వేర్వేరుగా రాఘవేందర్‌రావు ఇంటికి వెళ్లి ఇంద్రార్చితకు శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నతోద్యోగం పొందేలా, షాద్‌నగర్‌కు గుర్తింపు తెచ్చేలా ఇంద్రార్చితను ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. ఇదే పట్టుదలతో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇంద్రార్చితను అభినందించిన వారిలో వ్యాపారవేత్త గోపాల్‌గుప్తా, ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు బస్వం, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, ఇబ్రహీం, బీఆర్‌ఎస్ నాయకులు నరేందర్, లక్ష్మీనారాయణ, మురళీధర్‌రెడ్డి, నర్సింహ, యుగంధర్, కిషోర్, శేఖర్, జర్నలిస్టులు ఉన్నారు.

రోడ్డు కల్వర్టుల పూడ్చివేత



మట్టితో పూడ్చివేసిన కల్వర్టు

కేశంపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల వేసిన డబుల్ రోడ్డు దెబ్బతినకుండా, వర్షపు నీరు వెళ్లేలా కల్వర్టులు నిర్మించారు. కొందరు కల్వర్టును మూసివేశారు. ఇలా అయితే వర్షాలు కురిస్తే నీరు పోక రోడ్డు దెబ్బతింటుందని గ్రామస్తులు అంటున్నారు. సంగెం-వేముల్‌నర్వ డబుల్ రోడ్డులో అవసరం ఉన్నచోట కల్వర్టులు నిర్మించారు. అయితే సంగెం సమీపంలో కొందరు పొలం వద్ద కల్వర్టు మునిగిపోయేలా మట్టిపోశారు. అధికారులు రోడ్డు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కల్వర్టును పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రగతికి గ్రామాలే పట్టుకొమ్మలు

కేశంపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): దేశ ప్రగతికి గ్రామాలే పట్టుకొమ్మలని, గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులు బాగుండాలని జరుగాలని ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గ్రామసభలు నిర్వహించారు. కొనాయపల్లి, సుందరాపురం, కేశంపేట, కాకునూర్ ఎంపీడీవో పాల్గొన్నారు. నీటిని వృథా చేయొద్దని, ఓపెన్ నాళాలకు మూతలు బిగించేలా చూడాలని కోరారు. కార్యక్రమాల్లో ఎంపీవో కిష్టయ్య, ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి వ్యతిరేకంగా న్యాయవాదుల నిరసన



ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

వికారాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ వికారాబాద్ కోర్టు బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గురువారం న్యాయవాదులు విధులను బహిష్కరించి ఉగ్రవాదం నశించాలని నినాదాలు చేశారు. మూకల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మశాంతికి మౌనం పాటించారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూలి బస్వరాజ్ మాట్లాడుతూ.. పహల్గాం ఘటన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉగ్రదాడి కారకులను వదిలిపెట్టొద్దని, కఠిన చర్యలు తీసుకోవాలంటూ కేంద్రానికి రాసిన లేఖను ఆర్డీవోకు అందజేశారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఎస్.శుభప్రద్‌పటేల్, బార్ ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శంకరయ్య, కోశాధికారి మోహన్, లైబ్రేరియన్ సాయికుమార్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

పెద్దేముల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు పథకాలు ప్రవేశపెట్టారని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం పెద్దేముల్‌లో మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాయిదాలు సక్రమంగా చెల్లించి మరింత ఎక్కువ రుణం పొందాలని సూచించారు. అనంతరం మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా యాలటి పావని, కార్యదర్శి తలారి స్వరూప, కోశాధికారిగా మంజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్‌ప్రసాద్, డీపీఎం వీరయ్య, ఏపీఎం బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రగతి నివేదిక ప్రవేశపెడుతున్న అధికారులు

మారిన స్టూడెంట్ డ్రెస్ డిజైన్

తాండూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల డ్రెస్‌లో మార్పులు చేశారు. 6, 7 తరగతుల బాలబాలికలకు ఫుల్ ప్యాంట్‌ను కుట్టిస్తున్నారు. ఒక జతకు సరిపడా క్లాత్‌ను సరఫరా చేయాలని టీజీఎస్‌కోకు సూచించారు. యూనిఫాం కుట్టేందుకు వస్త్రాన్ని ప్రభుత్వం పట్టణాల్లో మెప్మాకు, మండలాల్లో సెర్ప్‌కు సరఫరా చేశారు. ఆర్పీల ఆధ్వర్యంలో కొలతలను ప్రారంభించారు. తాండూరులో టీఎంసీ రాజేంద్రప్రసాద్ డ్రెస్ మెటీరియల్‌ను అందజేశారు.



కొత్త డిజైన్‌లో విద్యార్థుల యూనిఫాం

దరఖాస్తుల గ్రౌండింగ్‌ను పూర్తి చేయాలి

» మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు దరఖాస్తుల గ్రౌండింగ్‌ను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రాధికగుప్తా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు సాంబశివరావు, బాబు మోసెస్, ఝాన్సీ రాణి, కాంతమ్మ, వినోద్, శివప్రసాద్ తదితరులతో కలిసి జిల్లాలోని అన్ని బ్యాంకర్ కంట్రోలర్లతో సమావేశం నిర్వహించి రాజీవ్ యువవికాసం పథకానికి వచ్చిన దరఖాస్తులు, గ్రౌండింగ్ ఎలా చేస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో శారద, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పీఎస్ఎన్ చౌదరి, కోశాధికారి ముత్యంరెడ్డి, ఉపాధ్యక్షుడు రాంచంద్రమూర్తి, జాయింట్ సెక్రటరీ వెంకటప్పయ్య పాల్గొన్నారు.

కమనీయం.. లక్ష్మీనారాయణస్వామి కల్యాణం

తలకొండపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): తలకొండపల్లి మండలం వెంకటాపూర్‌లో గల లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో గురువారం లక్ష్మీదేవి సమేత లక్ష్మీరాయణ స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ముఖ్య అతిథులుగా వచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ తిరుమణి శేఖర్‌గౌడ్, వైస్ చైర్మన్ బి.అంజన్‌రెడ్డిల ఆధ్వర్యంలో వసతులు ఏర్పాటు చేశారు. అర్చకులు యాదగిరి నర్సింహశాస్త్రి, కామేశ్వరమూర్తి కల్యాణ తంతు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం పల్లకిసేవ, బండ్లు తిరగడం కార్యక్రమాలు నిర్వహించారు. నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, చైర్మన్లు, అధికారులు రమేశ్, గట్ల కేశవరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, కాసు శ్రీనివాస్‌రెడ్డి, రాములు, విజయ్‌కుమార్‌రెడ్డి, ఆంజనేయులు గౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, నిరంజన్, మల్లేశ్, కృష్ణయ్య, శంకరయ్య, చంద్రయ్యగౌడ్, బాలస్వామి, అంజయ్య, అజీం, ఆరిఫ్, యాదగిరి, రాఘవేందర్, లక్ష్మీనర్సింహారెడ్డి, ముజ్బుర్ రహెమాన్, పవన్, కిరణ్, అంజయ్య, శ్రీను పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆన్‌లైన్ ఆటలొద్దు!

» వీడియో గేమ్స్, మొబైల్ చాటింగ్‌లతో నష్టాలే!
» సెలవులను సద్వినియోగం చేసుకోవాలి
» ఒత్తిడి లేని ఆటలాడాలి.. కళల్లో నైపుణ్యం పెంచుకోవాలి
» పెద్దల పర్యవేక్షణతో ఉత్తమ ఫలితాలు

పరిగి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): బడి పిల్లలకు వేసవి సెలవులొచ్చాయ్! ఇక వారు పుస్తకాలు పక్కనబెట్టి ఆటల్లో మునిగి తేలుతారు. ఇప్పటిదాకా స్కూలుకు వెళ్లిన వారు సెలవుల్లో నచ్చిన ఆటలు ఆడుకుంటారని వదిలేస్తే పొరపాటే. ఎందుకంటే ఈ చిన్నజాగ్రత్తలే వారి జీవితాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. అదెలానో చూద్దాం. ఎనిమిదేళ్ల వయసు నుంచి 16ఏళ్ల వయసు పిల్లల్లో మొబైల్ చాటింగ్, ఫేస్బుక్, ఇన్‌స్టా, కంప్యూటర్ గేమ్స్‌పై ఆసక్తి చూపుతున్నారు. ప్రతింట్లో స్మార్ట్ ఫోన్లు, మొబైల్ నెట్ ఉండడంతో చాలా మంది పిల్లలు నెట్‌గేమ్స్‌కు అలవాటుపడ్డారు. ఆడపిల్లలతో పోలిస్తే మగ పిల్లలు మరింత ఎక్కువగా వీడియో గేమ్స్ ఆడుతున్నారు. నీడపట్టున ఏదో ఆడుకుంటున్నారులే తలిదండ్రులు సైతం వదిలేస్తున్నారు. కానీ ఇది సరికాదని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు ఆడే వేగవంతమైన వీడియో గేమ్స్ వారి మానసిక, శారీరక స్థితిపై దుష్ప్రభావం చూపుతాయని హెచ్చరిస్తున్నారు.



పరిగిలోని ఓ నెట్‌క్యాబ్‌లో వీడియోగేమ్ ఆడుతున్న పిల్లలు

డిజిటల్ గేమ్స్‌తో అనర్థాలే...

బైక్‌పై మీద ఓ వ్యక్తి వెళ్తుండగా.. అతడిని నలుగురు ఓవర్‌టేక్ చేస్తారు. మరో హీరో వారందరిక కంటే ముందు వెళ్లి ఫైటింగ్‌కి రమ్మనడంతో కొట్లాట మొదలవుతుంది. యానిమేషన్ వీడియోలో కొట్లాడే వారి సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. రక్త ధారాగా కారుతుంది. ఈ గేమ్ హింసాత్మకంగా ఉంటుంది. ఇది చూసి పిల్లలు ఆనందిస్తారు. అలాగే రైఫిల్స్, పిస్తోళ్లు, గన్స్‌తో కాల్చుకోవడం వంటి గేమ్‌లను కూడా ఆసక్తిగా చూస్తారు. డిజిటల్ యానిమేషన్ గేమ్స్ అయినా ఇలాంటి హింసాత్మక వీడియోలు పిల్లల్లో యాక్షన్, హింసాత్మక ప్రవృత్తిని ప్రోత్సహిస్తాయని, జీవితంలో తామూ అలాగే చేయాలని అనుకుంటారని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇది పిల్లల జీవితానికి చెడును చేస్తుంది. ఇవే కాదు భారీ లారీలు, కార్లు, మోటారు సైకిల్స్ వగైరా ఆటల్లోనూ ఒకదానికొకటి ఢీకొనడం, ఓవర్‌టేక్ చేయడం, మితిమీరిన వేగంతో నడపడం వంటివుంటాయి. వాటిల్లో గెలవాలనే టెన్షన్ పిల్లల్లో ఉంటుంది. తరచూ ఇలాంటి మొబైల్ ఆటలతో చిన్నారుల మానసిక స్థితి సహజత్వాన్ని కోల్పోతుంది. చికాకు పెరుగుతుంది. ప్రతిదానికీ కోపం తెచ్చుకుంటారు. ఇతరాంశాలపై ఆసక్తి తగ్గుతుంది. శారీరక శ్రమ చేయలేరు. ఒకేచోట కూర్చుండడంతో ఊబకాయం వస్తుంది. గేమ్స్ ఆడుతూ చిరుతిండ్లు తింటే తిండిపోతులవుతారు. దృష్టి లోపాలూ తప్పవు. చిన్న వయసులోనే బీపీ, షుగర్, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక రుగ్మతలు వస్తాయి. తల్లిదండ్రులు, వేరెవరైనా చెప్పిన మాటలను పట్టించుకోరు. నిజ జీవిత విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. యానిమేషన్లు, కామిక్స్, కార్టూన్లు వారిని ప్రభావితం చేస్తాయి. భయం గొలిపే దయ్యాల కథలు, గ్రాఫిక్స్ వంటి వాటిని చూసి పిల్లలు రాత్రుల్లు భయపడతారు కూడా. ఇలాంటివి చూడకుండా తల్లిదండ్రులే జాగ్రత్తలు తీసుకోవాలి. ఫోన్లు, కంప్యూటర్ గేమ్స్ ఆడేకంటే కంటే శారీరక ఆటలకు పిల్లలను ప్రోత్సహించాలి.

ఒత్తిడి లేకుండా గడపాలి



వేసవి సెలవుల్లో ఇంగ్లిష్, హిందీ, ఇతర ఇండియన్ భాషలు నేర్చుకునే పుస్తకాలు, మంచి కామిక్స్ చదవాలి. స్ఫూర్తివంతుల జీవిత చరిత్రలను తెలుసుకోవాలి. ఇలాంటివి గూగుల్/యూట్యూబ్‌లోనూ దొరుకుతాయి. చెస్, క్యారమ్ ఆటలను ఆడించాలి. సాయంత్రం వేళ క్రికెట్, టెన్నిస్, స్విమ్మింగ్ వంటి ఔట్‌డోర్ గేమ్స్‌ను ఆడించొచ్చు. వీలుంటే కంప్యూటర్ పరిజ్ఞాన సముపార్జనకు రోజూ గంట, రెండు గంటల కోర్సుకు పంపితే భవిష్యత్తులో ఉపయోగకరంగా ఉంటుంది. సంగీతం, నృత్యం, పెయింటింగ్ వంటి కళలను నేర్పిస్తే సృజనాత్మకత పెరుగుతుంది. సెలవుల్లో టెన్షన్ లేని, ఒత్తిడి లేని వ్యాపకాలకు పిల్లలను ప్రోత్సహించాలి.

- డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పరిగి

ఉపయోగాలూ ఉన్నాయి



సాంకేతిక పరికరాలు, టెక్నిక్స్‌తో లాభాలూ ఉన్నాయి. గ్యాడ్జెట్స్ వాడకంతో టెక్నాలజీ వినియోగంపై నాలెడ్జ్ పెరుగుతుంది. వీడియో గేమ్స్‌తో పిల్లల్లో కొంత సృజనాత్మకత, ఆలోచనా విధానం అలవడుతుంది. రోజూ గంట కంటే ఎక్కువసేపు వీడియోగేమ్స్ ఆడొద్దు. ప్రమాదకర గేమ్స్ జోలికి వెళ్లొద్దు. ఆలోచనా విధానాన్ని, స్మార్ట్‌నెస్‌ను పెంచే గేమ్స్‌నే ఎంపిక చేసుకోవాలి. అలాంటి వాటితో పిల్లల్లో సమస్యలను ఎదుర్కొనే స్థాయిలు మెరుగవుతాయి.

- ఆంజనేయులు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, పరిగి



నటుడు సునీల్‌తో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

కందుకూరులో సినీ నటుడు సునీల్ సందడి

కందుకూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయానికి గురువారం ఉదయం సినీనటుడు సునీల్ వచ్చారు. ఆయన రాకను గమనించిన స్థానికులు, రెవెన్యూ సిబ్బంది ఆయనతో ఫొటో దిగేందుకు పోటీపడ్డారు. రాచులూరులో సునీల్ రెంగెకరాల భూమి కొన్నాడు. భూమి రిజిస్ట్రేషన్‌కు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఈ ప్రాంతంలో పెరుగుతున్న భూముల దరలతో పారిశ్రామికవేత్తలు, సినీ నటులు, దర్శకులు భూములను కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు.

విద్యుదుత్పత్తి ప్లాంట్‌ను మూసివేయాలి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని జవహర్‌నగర్ డంప్ యార్డులో వ్యర్థాలతో విద్యుదుత్పత్తి ప్లాంట్‌తో పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఉన్న దృష్ట్యా ప్లాంట్‌ను మూసివేయాలని పలు సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం డంప్ యార్డు వ్యతిరేక జేఏసీ, నవోదయ వెల్ఫేర్ సొసైటీ, సీఎస్‌ఆర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థలు ప్రకటన విడుదల చేశాయి. యార్డు చుట్టూ పరిసరాలను తాము పరిశీలించామని, విద్యుత్ ప్లాంట్‌తో అక్కడ నెమ్మదిగా ప్రజారోగ్య విపత్తు, పర్యావరణ సంక్షోభం తలెత్తుతున్నాయని తెలిపారు. స్థానికులు భౌతిక, పర్యావరణ సమస్యలు ఎదుర్కొంటున్నారని, కలుషిత గాలి, బూడిద కప్పిన ఇళ్లు, కలుషిత భూగర్భ జలాలు, దుర్వాసనతో అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యుదుత్పత్తి ప్లాంట్ హరిత పరిష్కారమని చెబు

వైద్య వృత్తి పవిత్రమైంది

చేవెళ్ల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సమాజంలో వైద్యవృత్తికి ఎంతో గౌరవం ఉందని, వైద్యులు దైవంతో సమానమని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం చేవెళ్లలోని పట్నం మహేందర్ రెడ్డి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్(2019)బ్యాచ్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డేను చేవెళ్ల పరిధిలో గల ఓ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. స్పీకర్, చీఫ్ విప్, శాంతా బయోటెక్ ఫార్మా అధిపతి పద్మభూషణ్ అవార్డీ డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, కళాశాల గ్రూప్ వైస్‌చైర్మన్ వరదారెడ్డి పాల్గొని ఎంబీబీఎస్ పూర్తిచేసుకున్న 132 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. దేశంలో వైద్య రంగంలో అపార అవకాశాలున్నాయన్నారు. గతంలో పెద్ద జబ్బుల చికిత్స కోసం అమెరికా వెళ్లేవారని, ప్రస్తుతం మన దేశంలోనే అధునాతన వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. హైదరాబాద్‌లో వరల్డ్ క్లాస్ ఆస్పత్రులు ఉన్నాయన్నారు. విదేశాల నుంచి సైతం ఎంతో మంది చికిత్స కోసం మన దేశానికి, ముఖ్యంగా హైదరాబాద్‌కు వస్తున్నారని చెప్పారు. వైద్యవృత్తిలో ప్రధానంగా సేవాగుణం, ఓపిక ఉండాలన్నారు. పేదలకు ఉచిత వైద్యసేవలందించేందుకు కృషిచేయాలన్నారు. వైద్య రంగంలో వస్తున్న పోటీని తట్టుకునేందుకు యువ వైద్యులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి వైద్యరంగానికి ప్రాధాన్యం ఇస్తున్నారని, రాష్ట్రంలో కొత్తగా 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రారంభమయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 4,090కి చేరిందన్నారు. ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంబీబీఎస్ వైద్యులు గ్రామీణులకు సేవా భావంతో వైద్యం చేయాలని సూచించారు. తమ కళాశాల మొదటి బ్యాచ్‌లో 132మంది విద్యార్థులు ఎంబీబీఎస్ పూర్తి చేశారని చెప్పారు. ఈ మెడికల్ కాలేజీని యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామన్నారు. శాంతా బయోటెక్ వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ... వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే రోగులకు మంచి మనస్సుతో వైద్యం చేయాలని సూచించారు. వైద్యులు వృత్తిధర్మాన్ని పాటిస్తూ పేదలకు వైద్యోనారాయణ అనేలా సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ జోయ రాణి, డైరెక్టర్లు సంతోష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, విప్ మహేందర్‌రెడ్డి, ముఖ్య అతిథులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ నేత బిచ్చిరెడ్డి

అధికార పార్టీలో ఆధిపత్య పోరు!

» విభేదాలు, బెదిరింపులతో పురుగులమందు తాగి నాయకుడి ఆత్మహత్యాయత్నం
» మెరుగైన చికిత్స కోసం వికారాబాద్‌కు తరలింపు

బషీరాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ మండలం మైల్వార్ కాంగ్రెస్ పార్టీలో అధిపత్య పోరు ముదిరింది. కొందరు నాయకుల బెదిరింపుతో మనస్తాపానికి గురైన ఓ నాయకుడు గురువారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. గ్రామంలో ఎమ్మెల్యే పర్యటన పూర్తయిన గంట వ్యవధిలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం కలకలం రేపింది. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే.. మైల్వార్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు సోంపల్లి బిచ్చిరెడ్డి గ్రామంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ప్రధాన అనుచరుడిగా ఉంటున్నాడు. అయితే పార్టీలో చేరిన కొందరు తనపై లేనిపోనివి ఎమ్మెల్యేకు చెబుతూ తనస్థాయిని దిగదార్చుతున్నారని మథనపడుతున్నాడని కుటుంబీకులు చెప్పారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే గ్రామంలో పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకొచ్చారు. ఎమ్మెల్యే సమక్షంలో బిచ్చిరెడ్డి సభలో మట్లాడుతుండగా కొందరు సమస్యలపై ఏకరువు పెట్టారు. దీంతో ఓ నాయకుడు బిచ్చిరెడ్డి నుంచి మైక్ లాక్కొని మాట్లాడారు. దీంతో బిచ్చిరెడ్డి మౌనంగా కూర్చున్నారు. ఎమ్మెల్యే మట్లాడి వెళ్తుండగా స్థానికులు కాన్వాయ్‌ను అడ్డుకుని సమస్యలపై నిలదీశారు. 'ఇదంతా బిచ్చిరెడ్డి అసమర్థత వల్లే.' అని కొందరు ఎమ్మెల్యేతో చెప్పారని మనస్తాపం చెందాడు. దీంతో బిచ్చిరెడ్డి ఇంటికొచ్చి సూసైడ్ నోట్‌రాసి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వికారాబాద్‌కు తరలించారు. ఘటనపై సమాచారం అందుకున్న ఎస్ఐ శంకర్ ఆస్పత్రికి చేరుకుని విచారణ జరిపారు. ఆసుపత్రిలో బిచ్చిరెడ్డిని ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, వైస్‌చైర్మన్ చందర్, గ్రామస్తులు పరామర్శించారు.

బిచ్చిరెడ్డి సూసైడ్ నోట్‌లో ఏం రాశారంటే...

"గ్రామంలో కాంగ్రెస్‌కు ఏ ఒక్క నాయకుడు లేనప్పుడూ పార్టీ కోసం పనిచేశాను. ఎమ్మెల్యేను గెలిపించుకున్నాం. ఎమ్మెల్యే కోసం గ్రామంలో వీధి దీపాలు, బోర్లు, సీసీ రోడ్లు వంటి పనులు చేయించాను. పంచాయతీ పనుల బిల్లులు కూడా రావాలి. పార్టీకి పని చేయని కొందరు ఇప్పుడూ ఎమ్మెల్యే దగ్గర చేరి నాపై లేనిపోని మాటలు చెబుతున్నారు. తరచూ బెదిరిస్తూ నా ఎదుగుదలను అడ్డుకుంటున్నారు. దీనికి కారణం అజయ్‌ప్రసాద్, సంగిశెట్టి సతీష్, సూరెపల్లి రాజు, గుండెపల్లి బుగ్గప్ప." అంటూ సుసైడ్ నోట్‌లో పేర్కొన్నారు.

పరామర్శించిన ఎమ్మెల్యే

పురుగుల మందు తాగిన బిచ్చిరెడ్డిని వికారాబాద్ మిషన్ ఆసుపత్రిలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పరామర్శించారు. గ్రామ రాజకీయాలతోనే తమ తండ్రికి ఈ దుస్థితి వచ్చిందని బిచ్చిరెడ్డి కూతుళ్లు ఎమ్మెల్యేతో ఆవేదనవ్యక్తం చేశారని తెలిసింది.

భూదాన్ భూముల అక్రమాలపై దర్యాప్తు చేయడానికి సిద్ధమా.. కాదా?

వైఖరి తెలపాలని సీబీఐకి హై కోర్టు నోటీసులు

నాగారంలో 26 ఎకరాల ప్రభుత్వ భూమిపై స్టే

హైదరాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): భూదాన్ భూముల అక్రమాలపై దర్యాప్తు చేయడానికి సిద్ధంగా ఉన్నారా? లేదా?.. వైఖరి తెలియజేయాలని సీబీఐకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అలాగే రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో 180, 182 తదితర సర్వే నెంబర్లలోని 26 ఎకరాల ప్రభుత్వ భూదాన్ భూముల విషయంలో అన్ని రకాల లావాదేవీలపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఏపీ, తెలంగాణకు చెందిన కొందరు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి, ఫోర్జరీ డాక్యుమెంట్లు పెట్టి, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో కుమ్మక్కై, సదరు భూములను అక్రమంగా బదిలీ చేసుకున్నారంటూ మహేశ్వరం మండలం అమీర్‌పేట్‌కు చెందిన బిర్ల మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదిస్తూ.. పిటిషనర్ తల్లి సదరు భూమిలో ఐదు దశాబ్దాలుగా వ్యవసాయం చేస్తున్నారని, సర్వే నెంబర్ 180లో వారి యాజమాన్యంలో ఉన్న భూమిని కుట్రపూరితంగా సర్వే నెంబర్ 194లో చూపించారని తెలిపారు. ఈ భూమి భూదాన్ భూమి అని చెప్పి 22-ఏ నిషేధిత జాబితాలో పెట్టినప్పటికీ సర్వే నెంబర్లు మార్చి అక్రమంగా ప్రైవేటు వ్యక్తుల పేర్లపైకి బదలాయించుకున్నారని పేర్కొన్నారు. అవినీతి అధికారులు, హై ప్రొఫైల్ వ్యక్తులు కుమ్మక్కై పలుమార్లు విక్రయ లావాదేవీలు జరిపారని ఆరోపించారు. ఈ అక్రమాలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదని, ధరణి పోర్టల్‌ను దుర్వినియోగం చేస్తూ సాదాబైనామాలను క్రమబద్ధీకరించే 13-బీ సర్టిఫికెట్లు సైతం జారీ అయ్యాయని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసినందుకు పిటిషనర్‌ను వేధించడమే కాకుండా రూ.కోటి పరువు నష్టం దావా వేశారని తెలిపారు. ఈ వ్యవహారంపై సీబీఐ, ఈడీ విచారణకు ఆదేశించాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. పేద ప్రజలు సాగు చేసుకుని జీవనం సాగిస్తారనే మంచి ఉద్దేశంతో దానం చేసిన భూములను సమాజంలో పలుకుబడి కలిగిన పెద్ద వ్యక్తులు తన్నుకుపోతున్నారని వ్యాఖ్యానించింది. ప్రతివాదులుగా రెవెన్యూ ముఖ్య కార్యదర్శి కం సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ సహా 26 మంది ప్రభుత్వ అధికారులకు కోర్టు నోటీసులు జారీ చేసింది.


చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కాంగ్రెస్‌ది పారదర్శక పాలన

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పారదర్శక పాలన అందిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. తలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.2.52 లక్షలు మంజూరయ్యాయి. వెంకటాపూర్‌లో గురువారం బాధిత కుటుంబాలకు పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కసిరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాభివృద్ధి, పేదరిక నిర్మూలనకు సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అంజయ్య, అజీం, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమేశ్ యాదవ్, నాయకులు యాదగిరి, అజీజ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

కడ్తాల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కడ్తాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీవో లాలయ్య, కార్యదర్శి అల్లాజీ, ఎన్ఐఆర్‌డీ పీఆర్ ప్రతినిధి నిధిసింగ్‌లను రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి సత్కరించి అభినందించారు. దోనాదుల మహేశ్, భిక్షపతి, వెంకటయ్యగౌడ్, చందోజీ, రమేశ్, రవి, శ్రీశైలం, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


భాస్కర్‌రెడ్డి, లాలయ్య, నిధిసింగ్‌లను సన్మానిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

ఆహార శుద్ధి.. అతివల వృద్ధి

(5వ పేజీ తరువాయి)

అందించిన ప్రోత్సాహంతో నెలకొల్పిన ఆహార ఉత్పత్తుల శుద్ధి యూనిట్లు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఆర్థికంగా వృద్ధి చెందుతూ తోటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

యూనిట్లతో సత్ఫలితాలు..

స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఏర్పాటు చేసిన యూనిట్లు జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఆయా యూనిట్లు పొందిన మహిళలు సమర్థవంతంగా వాటిని నిర్వహిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ఎంటర్ ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ)లో 2023-24, 2024-25 సవత్సరంలో 256 మందికి ఆర్థిక చేయూతనివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. లక్ష్యాన్ని అధిగమించి అధికారులు నిధులు మంజూరు చేశారు. 182 యూనిట్లకు రూ.5కోట్ల 22 లక్షలు మంజూరు చేశారు. అందులో రూ.కోటి 30 లక్షలు సబ్సిడీగా పొందారు. మొత్తం యూనిట్ కాస్ట్‌లో 10 శాతం లబ్ధిదారుడు చెల్లించారు. మిగతా 35 శాతం సబ్సిడీ పొందారు. 55 శాతం బ్యాంకు రుణంగా తీసుకొని కోల్డ్ ఫ్రిడ్జ్, ఆయిల్ మిల్లులు, బేకరి యూనిట్లు, జొన్న రొట్టెలు, బిస్కెట్లు, బ్రెడ్ తయారీ యూనిట్లు, అల్లం వెల్లుల్లి, మసాల తయారు చేసే మిషనరీ కొనుగోలు చేసుకుని ఉపాధి పొందుతున్నారు.

నెలకు రూ.35 వేలు సంపాదిస్తున్నా



పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా రూ.5,30,000 రుణంగా తీసుకున్నాను. స్థానికంగా ఉన్న యూకో బ్యాంకు రుణం ఇచ్చింది. తీసుకున్న డబ్బులతో సహజసిద్ధంగా ఆయిల్ తయారీ చేసే యంత్రాన్ని ఏర్పాటు చేసుకున్నాను. మార్కెట్‌లో విచ్చలవిడిగా అమ్ముతున్న కల్తీ నూనెలకు స్వస్తి చెప్పి చాలావరకు పల్లి నూనె, నల్లకుసుమలు, తెల్ల కుసుమల నూనెను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో నాచురల్ ఆయిల్‌కు డిమాండ్ పెరిగింది. నేను ఏర్పాటు చేసిన ఆరోగ్య న్యాచురల్ ఆయిల్స్ అండ్ ఫుడ్స్‌లో నాతో పాటు మరో ఇద్దరు ఉపాధి పొందుతున్నారు. నెలకు రూ.35వేలు సంపాదిస్తున్నాను. తీసుకున్న రుణం 2023 జూలై వరకు తీర్చేశాను.

- జంబుల స్వప్న, స్ఫూర్తి స్వయం సహాయక సంఘం, అప్పోజిగూడ, మొయినాబాద్ మండలం

పీఎం ఆహార శుద్ధి కార్యక్రమాల వివరాలు

మండలం	లక్ష్యం	యూనిట్లు	రూ.లక్షల్లో	సబ్సిడీ
అబ్దుల్లాపూర్‌మెట్	10	14	72.21	25.38
ఆమనగల్లు	08	10	7.00	1.40
చేవెళ్ల	12	08	24.90	8.46
చౌదరిగూడెం	09	03	11.31	2.80
ఫరూక్‌నగర్	19	0	13.43	3.15
ఇబ్రహీంపట్నం	10	12	20.73	3.06
కడ్తాల్	15	06	26.26	6.47
కందుకూరు	12	11	23.12	8.35
కేశంపేట	16	11	21.46	3.79
కొందుర్గు	13	09	39.80	7.81
కొత్తూరు	11	06	32.17	6.75
మాడ్గుల	09	05	12.73	3.05
మహేశ్వరం	10	09	18.91	5.33
మంచాల	10	10	14.27	2.54
మొయినాబాద్	13	10	22.73	4.63
నందిగామ	21	09	18.51	2.59
షాబాద్	12	03	10.80	0.35
శంషాబాద్	10	11	32.51	10.79
శంకర్‌పల్లి	11	04	38.54	10.00
తలకొండపల్లి	11	09	12.81	2.73
యాచారం	14	15	40.39	11.45
	256	182	522.34	130.88

ఆహార శుద్ధి పరిశ్రమలకు ప్రాధాన్యం



గ్రామీణ ప్రాంతాల యువత కోసం కేంద్ర ప్రభుత్వం పీఎంఎఫ్ఎంఈ పథకం అమలు చేస్తుంది. దీనిలో ఆహార శుద్ధి పరిశ్రమలకు ప్రాధాన్యమిస్తుంది. స్వయం సహాయక సంఘాలు, సమాఖ్యలు పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సాహకాలు అందిస్తుంది. మిర్చి పౌడర్, పసుపు పొడి, జొన్న రొట్టెల తయారీ, చెక్క గానుగ నూనె, బిస్కెట్ల తయారీ, పల్లిపట్టి, బ్రెడ్ తయారీ యూనిట్లు, హోంఫుడ్, బేకరి యూనిట్లు, అల్లంవెల్లుల్లి తయారీ యూనిట్లు, పాల శుద్ధీకరణ యూనిట్ల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారు.

- వి.విలాస్, డీఆర్డీఏ జిల్లా ఫార్మ్ ప్రాజెక్టు మేనేజర్

క్రైం కార్నర్

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని.. ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

● రెండు నెలల తర్వాత వెలుగులోకి..
● షాద్‌నగర్ మండలం చిన్నచిల్కమర్రిలో ఘటన
● భార్య, ప్రియుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రంగస్వామి, అదుపులో నిందితులు


యాదయ్య(ఫైల్)

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత్యచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఏసీపీ రంగస్వామి వెల్లడించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నచిల్కమర్రి గ్రామానికి చెందిన ముద్దనొళ్ల యాదయ్య(32)కు కొందుర్గు మండలం మహదేవ్‌పూర్‌కు చెందిన మౌనికతో 8ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు. కూలి పనులు చేసుకునే యాదయ్య వచ్చిన డబ్బుతో మద్యం తాగి తరచూ భార్యతో గొడవపడేవాడు. కుటుంబ పోషణ కోసం మౌనిక గ్రామ శివారులో ఉన్న రాఘవేంద్ర కాటన్ మిల్లులో పనికోసం వెళ్లేది. అదే కంపెనీకి కూరగాయలు సరఫరా చేసే కందివనం గ్రామానికి చెందిన ఎరుకలి అశోక్‌తో పరిచయం ఏర్పడింది. ఈక్రమంలో పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. భర్త తనను పెట్టే బాధలు అశోక్‌కు చెప్పి భర్తను చంపాలని పథకం వేశారు. అందులో భాగంగా ఫిబ్రవరి 18, 2015న రాత్రి 7 గంటలకు అశోక్ శికారుకు తీసుకెళ్లే ఓ కత్తిని తీసుకొని.. రామాంజపూర్‌లోని తన బాబాయి ఇంట్లో దావత్ ఉందని యాదయ్యకు చెప్పి మౌనికను కూడా ఆటోలో ఎక్కించుకొని వెళ్లాడు. ఈక్రమంలో మార్గమధ్యలో పెట్రోల్ కొనుక్కున్నారు. అయితే, డబ్బాలో పెట్రోల్ ఎందుకని బంక్ సిబ్బంది ప్రశ్నించగా.. బంధువుల బైక్‌లో పెట్రోల్ అయిపోయిందని నమ్మించాడు. తర్వాత మద్యం కూడా కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి కొత్తూరు మండలం గూడూరు శివారులోని పెద్దగట్టు తండా దాటిన తర్వాత నిర్మానుష్య ప్రదేశానికి ఆటోను తీసుకెళ్లి యాదయ్యకు పూటుగా మద్యం తాగించారు. అనంతరం అశోక్ అప్పటికే తనవెంట తెచ్చుకున్న కత్తితో యాదయ్య గొంతు కోసి చంపి, శరీరంపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. చనిపోయాడని నిర్ధయించుకొని డెడ్‌బాడీని అక్కడే గోతిలో పాతిపెట్టి ఇంటికి వెళ్లారు. అనంతరం 24 ఫిబ్రవరి 2025న తన భర్త నాలుగు రోజుల నుంచి కనిపించడం లేదని మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత రెండు నెలలు తల్లి గారింటి వద్ద ఉంది. అయితే, వారం రోజులనుంచి షాద్‌నగర్ పట్టణంలోని అయ్యప్ప కాలనీలో అశోక్‌తో కలిసి ఆమె నివాసముంటోంది. గమనించిన చిల్కమర్రి గ్రామస్తులు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గురువారం ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. సంఘటనా స్థలానికి వెళ్లి పుర్రె, ఎముకలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మౌనిక, అశోక్‌లను రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మధురాపూర్‌నకు చెందిన కుమార్(30) బుధవారం ఓ గ్రామంలో జరిగిన బంధువుల పెళ్లికి వెళ్లి సాయంత్రం స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా సోలీపూర్‌తండా వద్ద రోడ్డుపై స్పీడ్‌బ్రేకర్ వద్ద బైక్ అదుపుతప్పడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం ఉస్మానియాకు తరలించారు. చికిత్సపొదుతూ గురువారం మృతిచెందినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు.

సర్వేతోనే సరి!

(5వ పేజీ తరువాయి)

16 మంది గాయపడ్డారు. ఆదిభట్లలో ఏడుగురు మృతి చెందగా, 18 మంది గాయపడ్డారు.

నివేదిక సిద్ధం చేసిన అధికారులు

సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారి విస్తరిస్తే గున్‌గల్‌లో 4 దుకాణాలు, ఆగాపల్లిలో 5 దుకాణాలు, యాచారంలో 30 దుకాణాలు, ఇండ్లను కూల్చాల్సి ఉంటుందని అప్పట్లో ఆర్అండ్‌బీ అధికారులు నివేదిక తయారు చేశారని తెలిసింది. ప్రజల అభిప్రాయం తీసుకుంటే ఇండ్ల కూల్చివేతలో ఇబ్బందులుండవని అధికారులు చెప్పారు. కాగా యాచారం, గున్‌గల్, మాల్ గ్రామాలలో దుకాణాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా రహదారి విస్తరించాలని ఆర్అండ్‌బీ శాఖ అధికారులను ఆయా గ్రామాల వ్యాపారులు కోరారు. ఇబ్రహీంపట్నం నుంచి మాల్ వరకు 34 కిలోమీటర్ల దూరంలో ఉన్న రోడ్డు విస్తరణకు రూ.90కోట్ల మేర నిధులు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు.

చెరువుకట్టతో పాటు కిందిభాగం వెడల్పు చేయాలి

ఇబ్రహీంపట్నం చెరువుకట్టతో పాటు ప్రస్తుతం కట్టకింది భాగాన కూడా రోడ్డును విస్తరించాలని వాహనాదారులు కోరుతున్నారు. అలాగే శేరిగూడ సమీపంలో అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిని పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఇబ్రహీంపట్నం నుంచి మాల్ వరకు డివైడర్ వేయాలి



ఇబ్రహీంపట్నం నుంచి మాల్ వరకు డబుల్ రోడ్డు వేయాలి. రోడ్డు విస్తరించి డివైడర్ ఏర్పాటు చేస్తే రోడ్డు ప్రమాదాలు జరగవు. జనవరి నుంచి ఇప్పటి వరకు డివిజన్‌లో 22మంది మరణించగా 59మంది గాయపడ్డారు.

- కేవీవీ రాజు, ఇబ్రహీంపట్నం [illegible]

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : వీర్లపల్లి


కొందుర్గులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

చౌదరిగూడ/యాచారం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం కొందుర్గు మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతు లు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ధాన్యానికి క్వింటాలుకు రూ.2,320 గిట్టుబాటు ధరతోపాటు ప్రభుత్వం బోనస్ కింద రూ.500 చెల్లిస్తుందన్నారు. ఉమ్మడి కొందుర్గు మండలంలో ఆరు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం తంగెళ్లపల్లిలో 11కేవీ విద్యుత్ లైన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యుత్ సమస్యఉన్న గ్రామాల్లో 3వేల స్తంభాలు, 300 ట్రాన్స్‌ఫార్మర్లు, 90 కిలోమీటర్ల మేర విద్యుత్ వైర్లను అందిజేసినట్లు తెలిపారు. అలాగే జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధి లాల్‌పహాడ్‌లో నూతన మార్కెట్ యార్డు ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేశారు. ఏడీఏ రాజరత్నం, తహసీల్దార్ రమేష్‌కుమార్, ఏవోలు రాజేందర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, చలివేంద్రంపల్లి రాజు, చంద్రశేఖర్, ఇబ్రహీం, యాదయ్య, నరేందర్, రాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో రైతుల ఉద్ధరణకు తమ ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి వెల్లడించారు. యాచారం మండలం నందివనపర్తి, చింతపట్ల, మంతన్‌గౌరెల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నర్సింహ, అక్బర్, బీఎస్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మంఖాల దాసు, మాజీ వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డిలున్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

ఆమనగల్లు : ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో ధాన్యం రాసులు రోజురోజుకూ పేరుకుపోతున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వారం, పది రోజులుగా రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చి సీసీపై తేమశాతం కోసం ఆరబెడుతున్నారు. ఉదయం ఎండ, సాయంత్రం అకాల వర్షాలతో తేమశాతం రాని కారణంగా ఆందోళన చెందుతున్నారు. కాగా, గురువారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆమనగల్లు మండలంలో 5,580, తలకొండపల్లిలో 5,600, కడ్తాలలో 4,000, మాడ్గులలో 5,300 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు రికార్డులు తెలుపుతున్నాయి. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో ఈనెల 18న పౌరసరఫరాల శాఖ సహకారంతో తలకొండపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రారంభించారు. గురువారం ఐదుగురు రైతులకు చెందిన 884 బస్తాల ధాన్యం కొనుగోలు చేశారు. కొనుగోళ్లలో వేగం పెంచాలని రైతులు కోరుతున్నారు.


యాచారం : నందివనపర్తిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గురునాథ్‌రెడ్డి

నేడు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు

ఆమనగల్లు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న భూ భారతి చట్టంపై నేడు(శుక్రవారం) ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మీ గార్డెన్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ లలిత తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డిలు హాజరవుతారని పేర్కొన్నారు. రైతులు, ప్రజలు పాల్గొని భూ భారతి చట్టం గురించి తెలుసుకోవాలని కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీరోజు యోగా సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని షాద్‌నగర్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని శ్రీ బాలాజీ టౌన్‌షిప్‌లో యోగా గురువు శశిధర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత యోగా శిక్షణ కేంద్రాన్ని గురువారం సీఐ ప్రారంభించారు.

ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్లు విడుదల

చేవెళ్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు చేవెళ్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చిన్నపరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రవేశం పొందేందుకుగాను పరీక్ష రాసే విద్యార్థుల హాల్‌టికెట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఇంటర్‌నెట్ సెంటర్ల వద్ద డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 27న ప్రవేశ పరీక్షలు ఉంటాయని, 6వ తరగతిలో ప్రవేశానికి ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్నం 2గంటల నుంచి 4 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు సూచించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

యాచారం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): దేశ సమగ్రతకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని, అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్.గిరిధర్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. గురువారం నందివనపర్తి, చింతపట్ల, మంతన్‌గౌరెల్లి గ్రామాలలో జైభీమ్, జైబాపు, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలు చేబూని ర్యాలీ నిర్వహించారు. బీఎస్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్ రెడ్డి, మంకాల దాసు, మాజీ ఎంపీపీ ఆర్.వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ కె.శ్రీనివాస్ రెడ్డి, ముత్యాల వెంకటరెడ్డి, కె.అరవింద్‌నాయక్, అమృతాసాగర్ తదితరులున్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి

కడ్తాల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీవో లాలయ్య, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డిలు అన్నారు. కడ్తాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం కార్యదర్శి అల్లాజీ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను గ్రామసభ దృష్టికి తేగా.. పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

చదువులో రాణించాలి

కందుకూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): చదువులో రాణించి పాఠశాలతో పాటు గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని బాచుపల్లి మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ కోరారు. గ్రామానికి చెందిన పోలా తేజస్విని నేదునూరు ఆదర్శ జూనియర్ కాలేజీలో ఎంపీసీ సెకండియర్ చదివి 954/1000 మార్కులు సాధించగా ఆమెను గ్రామంలో సన్మానించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

ఉగ్రవాదాన్ని అంతమొందిద్దాం

● ప్రజాప్రతినిధులు, నాయకులు ● హిందూ సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ.. పాకిస్థాన్ దిష్టిబొమ్మ దహనం


శంషాబాద్ : కొవ్వొత్తుల ర్యాలీలో హిందూ సంఘాలు


షాద్‌నగర్ : ఉగ్రదాడికి నిరసనగా విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

షాద్‌నగర్ అర్బన్/షాద్‌నగర్/మొయినాబాద్/కేశంపేట/కందుకూరు/శంషాబాద్/యాచారం/ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని అంతమొందిద్దామని ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా గురువారం షాద్‌నగర్ పట్టణంలో హిందూ సంఘాలు భారీ నిరసన ర్యాలీని చేపట్టాయి. హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీలో బీజేపీ, బీఆర్ఎస్, బీసీ సేన, బ్రాహ్మణ సంఘం, వ్యాపారసంఘాలు పాల్గొని నిరసన వ్యక్తం చేశాయి. జాతీయ, కాషాయ జెండాలు చేబూని పాకిస్థాన్‌కు, టెర్రరిజానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మొయిన్‌రోడ్డు మీదుగా చౌరస్తాకు చేరుకుని పాకిస్థాన్ దిష్టిబొమ్మను దహనం చేసి, నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీగా మండల తహసిల్దార్ కార్యాలయానికివెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులున్నారు. ఉగ్రదాడులకు నిరసనగా షాద్‌నగర్ కోర్టు న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. షాద్‌నగర్ కోర్టు సముదాయాల పరిధిలో పాత జాతీయ రహదారిపై పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం న్యాయవాదులు మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రేరేపిత ముష్కరులు హిందువులను కాల్చిచంపడం అత్యంత అమానుషకరమని వ్యాఖ్యానించారు. మొయినాబాద్‌లో ఏబీవీపీ ఆధ్యర్యంలో యువకులు పాకిస్తాన్ దిష్టిబొమ్మ దహనం చేసి ర్యాలీ నిర్వహించారు. షాపురం శ్రీకాంత్, మహేష్, యువకులున్నారు. ఉగ్రదాడి పిరికిపంద చర్య అని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీ అభివర్ణించారు. కేశంపేట మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతులకు నివాళులర్పించారు. సంతాపూర్‌లో గ్రామస్తులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు రఘురాములుగౌడ్, ఐలయ్య, మధుసూదన్‌గౌడ్, శ్రీనివాస్, సంతాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు. ఉగ్రదాడులను ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్తయ్య, బీజేపీ కందుకూరు మండల శాఖ అధ్యక్షుడు అంజిరెడ్డిలు అన్నారు. ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు బక్క మల్లేష్, గౌర ప్రభాకర్‌లతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. హైద్రాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కృష్ణకుమార్, రాంరెడ్డి, ఎస్.భూమిరెడ్డి, ఎస్.దయాకర్‌రెడ్డి, యాదగిరి, కుమార్, తదితరులున్నారు. ఉగ్రదాడిని నిరసిస్తూ హిందూ సంఘాలు శంషాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాయి. పాకిస్థాన్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. శంషాబాద్ జెండా చౌరస్తాలోని శ్రీహనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ భారత్ చౌరస్తా, అంగడిబజార్, రాణాప్రతాప్‌వీధి, నర్సింగ్‌మందిర్‌బస్తీ, కటికెగడ్డ, గొల్లగడ్డ, కాపుగడ్డ, కుమ్మరి బస్తీ, రైల్వేస్టేషన్ రోడ్, తదితర కాలనీలు, బస్తీల మీదుగా అంబేడ్కర్‌చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్‌ల గుండా హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి పక్కన ఉన్న హనుమాన్ ఆలయం వరకు కొనసాగింది. యాచారం మండలం మొండిగౌరెల్లిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలతో పాటు కొవ్వొత్తులను ప్రదర్శించారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని గణేష్ మంటపం ఎదుట నివాళులర్పించారు. బీజేపీ మండలాధ్యక్షుడు తాండ్ర రవీందర్ పలువురు యువకులు పాల్గొన్నారు. అలాగే ఇబ్రహీంపట్నంలోని సెయింట్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఇబ్రహీంపట్నంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. సెయింట్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. చౌరస్తా వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ డా.పి.వేణుగోపాల్‌రెడ్డి, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాళ్లు డా.జి.అనిల్‌కుమార్, డా.ఇ.హరికృష్ణ, ఏవో వంశీ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉగ్రదాడిని పలు పార్టీలు, విద్యార్థి సంఘాలు ముక్తకంఠంతో ఖండించాయి. గురువారం రాత్రి ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. మృతులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ దాడి యాతవ్ ప్రపంచాన్ని కుదిపేసిందని, ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో తుదముట్టించాల్సిందేనని బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటి) అన్నారు. ఉగ్రవాద ప్రేరేపిత పాక్‌కు తగు బుద్ధి చెప్పాలన్నారు. బుగ్గరాములు, కృపేష్, యాదగిరి, దండేట్‌కార్ రవి, భరత్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు, సుల్తాన్, వెంకట్‌రెడ్డి, రాజు, నిట్టు జగదీష్ తదితరులున్నారు.



షాద్‌నగర్‌లో హిందూ సంఘాల నిరసన ర్యాలీ


ఇబ్రహీంపట్నం : బీఆర్ఎస్ కార్యకర్తల శాంతి ర్యాలీ


యాచారం : మొండిగౌరెల్లిలో మృతులకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు


మొయినాబాద్: పాకిస్థాన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యువకులు


కందుకూరు : ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు